నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, ఆదివారం 20 అక్టోబర్ 2024 | YADADRI BHUVANAGIRI

జాతీయ సాహస శిబిరానికి సైనిక్ కాలేజ్ విద్యార్థిని

బీబీనగర్, అక్టోబర్ 19 : ఎన్ఎస్ఎస్ జాతీయ సాహస శిబిరానికి మండలంలోని రాఘవాపురం గ్రామంలో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ సైనిక మహిళా కళాశాలకు విద్యార్థిని ఎల్.ప్రతిభ ఎంపికైనట్టు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ నారూప తెలిపారు. ఈ నెల 22 నుంచి 31 వరకు హిమాచల్ప్రదేశ్ ధర్మశాలలోని పర్వతారోహణ శిక్షణ సంస్థలో జాతీయ సాహస శిబిరం జరుగుతుందని పేర్కొన్నారు. ఎంపికైన వలంటీర్లకు పర్వతారోహణ, పారాగ్లైడింగ్, రివర్ రాఫ్టింగ్ వంటి కార్యక్రమాల్లో శిక్షణ ఇస్తారని వివరించారు. కళాశాలకు చెందిన ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కె.స్రవంతి సాహస శిబిరానికి కంటింజెంట్ లీడర్గా మహాత్మా గాంధీ యూనివర్సిటీ తరపున ఎంపికైనట్లు తెలిపారు.

సాహస శిబిరానికి ఎంపికైన ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ స్రవంతి, వలంటీర్ ప్రతిభను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపల్ నిరూప

కోర్టును ప్రారంభిస్తున్న హైకోర్టు జడ్జిలు జస్టిస్ జువ్వాది శ్రీదేవి, జస్టిస్ కూనూరు లక్ష్మణ్

రామన్నపేట సబ్ కోర్టు ప్రారంభం

రామన్నపేట, అక్టోబర్19 : రామన్నపేటకు మంజూరైన సీనియర్ సివిల్ జడ్జి కోర్టు (సబ్కోర్టు) ప్రారంభోత్సవం పండుగ వాతావరణంలో జరిగింది. హైకోర్టు జడ్జి, యాదాద్రి భువనగిరి జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జువ్వాజీ శ్రీదేవి, హైకోర్టు జడ్జి కూనూరు లక్ష్మణ్ ముఖ్యఅతిథులుగా హాజరైన శనివారం సబ్కోర్టును ప్రారంభించారు. కోర్టు హాల్, సూపరింటెండెంట్ గదిని అందుబాటులోకి తెచ్చారు. అంతకుముందు పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. కలెక్టర్, డీజీపీ, వివిధ కోర్టుల న్యాయమూర్తులు, న్యాయవాదులు వారికి ఘన స్వాగతం పలికారు. వివిధ బార్ అసోసియేషన్ల సభ్యులు జ్ఞాపికలను అందజేసి శాలువాలతో సత్కరించారు. నలభై ఏండ్ల నిరీక్షణ తర్వాత సబ్ కోర్టు రావడంపై న్యాయమూర్తులు, మండల ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం కోర్టు భవనాల సముదాయం నిర్మాణం కోసం రామన్నపేట శివారులోని కొమ్మాయిగూడెం రోడ్డులో సంబన్ బోర్డు వద్ద కేటాయించిన ఐదెకరాల స్థలాన్ని హైకోర్టు జడ్జిలు శ్రీదేవి, లక్ష్మణ్ పరిశీలించారు.కార్యక్రమంలో జిల్లా ప్రిన్స్పల్ సెషన్స్ జడ్జి సంపూర్ణ ఆనంద్, కలెక్టర్ హనుమంతు కే జండగే, సబ్ కోర్టు జడ్జి మాధవీలత, డీసీపీ రాజేశ్చంద్ర, ఆర్డీఓ రాజశేఖర్రెడ్డి, స్థానిక కోర్టు జడ్జిలు ప్రదీప్, చందన, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అబ్దుల్ మజీద్, తాసీల్దార్ లాల్బహదూర్, ఎంపీడీఓ యాకూబ్నాయక్, సీఐ వెంకటేశ్వర్లు, సీనియర్ న్యాయవాదులు యాపాల కృష్ణారెడ్డి, దూశర్ల నరేందర్రావు, కంపాటి యాదగిరి, జినుకల ప్రభాకర్, ఉయ్యాల హనుమంతు, శోభన్ బాబు, బి.అశోక్కుమార్, ఎన్ మొగలయ్య, జగతయ్య, మామిడి వెంకట్రెడ్డి, యాదాసు యాదయ్య, సంగిశెట్టి బాలరాజు, కూనూరు శ్రీనివాస్, పాల్గొన్నారు.

అన్నదాతకు దోఖా

'సబ్ కమిటీ రిపోర్ట్ రాగానే వచ్చే పంట కాలం అంటే రబీకి రైతు భరోసా ఇస్తాం. ఈ ఖరీఫ్కు లేనట్లే. గతంలో పెండింగ్ ఉన్న రూ.7,600 కోట్లు మేము ఇచ్చాం కాబట్టి ఇప్పుడు ఖరీఫ్కు ఇవ్వలేం'

- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్రావు వ్యాఖ్యలివి

రూ.2వేలకోట్లకు సర్కారు ఎగనామం

వానకాలం సీజన్ రైతుభరోసా లేనట్లే

అధికారం కోసం ఎన్నికల హామీలో భాగంగా పంట రుణం తీసుకున్న ప్రతి రైతుకు రూ.2లక్షల రుణమాఫీ, ఒక్కో సీజన్లో రూ.7,500 రైతు భరోసా ఇస్తామని ఊదరగొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం నిజ స్వరూపం ఒక్కొక్కటిగా బయటపడుతున్నది. ఇప్పటికే రుణమాఫీకి కొర్రీల మీద కొర్రీలతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రెండున్నర లక్షల మంది రైతులను పక్కన పెట్టింది. తాజాగా ఉమ్మడి జిల్లా రైతులకు వానకాలంలో రైతు భరోసాగా అందాల్సిన రూ.2వేల కోట్లకు ఎగనామం పెట్టేందుకు సిద్ధమైంది. సీజన్ ఆరంభంలో ఇవ్వాల్సిన రైతు భరోసాను సీజన్ ముగిసినా ఇవ్వకపోగా, చావు కబురు చల్లగ చెప్పినట్లుగా వానకాలం సీజన్కు రైతు భరోసా ఇవ్వలేమని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్రావు ప్రకటించారు. రబీ నుంచి ఇస్తామంటూ.. అబీ రైతుభరోసాపై వేసిన సబ్ కమిటీ రిపోర్ట్ వచ్చాకేనని కుండబద్దలు కొట్టారు. ఇన్నాళ్లు ఇగో వస్తుందేమో... అగో వస్తుందేమోనని ఎదురుచూస్తున్న రైతుల ఆశలపై నీళ్లు చల్లారు. కాంగ్రెస్ ప్రభుత్వ మోసాకారి తీరుపై రైతులు తీవ్రంగా మండిపడుతున్నారు. రైతులకు మద్దతుగా బీఆర్ఎస్ పార్టీ ఆదివారం ఆందోళనలకు సిద్ధమైంది. అన్ని మండల కేంద్రాల్లో ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. మరోవైపు శనివారమే సూర్యాపేటలో రైతులతో కలిసి బీఆర్ఎస్ శ్రేణులు హైవేపై ఆందోళనకు దిగాయి. సీఎం రేవంత్రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి తమ నిరసన వ్యక్తం చేశాయి.

– నల్లగొండ ప్రతినిధి, అక్టోబర్19 (నమస్తే తెలంగాణ)

మంత్రి తుమ్మల ప్రకటనతో తేటతెల్లం
వచ్చే పంట కాలం రబీకి ఇస్తామన్న మంత్రి
దానికి కూడా సబ్ కమిటీ రిపోర్ట్ రావాలట!
సీజన్ ఆరంభం నుంచి ఎదురుచూస్తున్న రైతులు
కాంగ్రెస్ సర్కారు తీరుపై తీవ్ర ఆగ్రహం
రైతులకు మద్దతుగా నేడు బీఆర్ఎస్ ధర్నాలు
ఉమ్మడి జిల్లాలో 11 సీజన్లలో రూ.11,700 ఇచ్చిన కేసీఆర్ ప్రభుత్వం

సూర్యాపేటలోని జనగాం క్రాస్ రోడ్డులో సీఎం రేవంత్రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, రైతులు

ఒక్కో సీజన్లో ఉమ్మడి నల్లగొండ జిల్లా రైతులకు రూ.2వేల కోట్ల వరకు పంట పెట్టుబడి సాయంగా అందాల్సి ఉంది. గతంలో కేసీఆర్ సర్కార్ హయాంలో 11లక్షల మంది రైతులకు ఒక్కో సీజన్లో ఎకరాకు రూ.5వేల చొప్పున రూ.1,300కోట్ల వరకు రైతుబంధు డబ్బులు అందేవి. ప్రస్తుతం ఎకరాకు రూ.7,500 రైతు భరోసాగా అందిస్తే మరో 50 శాతం అదనంగా లబ్ధి చేకూరాల్సి ఉంది. అంటే రూ.2వేల కోట్ల రైతుభరోసా రైతులకు చెందాలి. కానీ వానకాలం రైతుభరోసాను సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎగ్గొట్టేందుకు సిద్ధమైంది. ఇప్పటికే ఉమ్మడి నల్లగొండ జిల్లా రైతులకు రుణమాఫీలో తీవ్ర అన్యాయం చేసింది. సుమారు రెండున్నర లక్షల మంది అర్హులైన రైతులకు రకరకాల కారణాలతో రుణమాఫీ చేయలేదు. వారంతా బ్యాంకుల చుట్టూ, అధికారుల చుట్టూ తిరిగి వేసారుతున్నారు. ఇక పులిమీద పుట్రలా వానకాలం సీజన్కు రైతుభరోసా ఇచ్చేది లేదని మంత్రి తుమ్మల నాగేశ్వర్రావు నింపాదిగా చెప్పుకొచ్చారు. అలా ఉమ్మడి నల్లగొండ జిల్లా రైతులకు ఒక్కో సీజన్లో పెట్టుబడి సాయంగా అందాల్సిన సుమారు రూ.2వేల కోట్లకు ఎసరు పెట్టారు. వానకాలం సీజన్ ఆరంభం జూన్ నెల నుంచి ఉమ్మడి జిల్లాకు చెందిన 11లక్షల మందికి పైగా రైతులు రైతుభరోసా కోసం ఎదురుచూస్తున్నారు. జూన్.. జూలై.. అంటూ సెప్టెంబర్ వరకు వేచి చూశారు. అక్టోబర్లోనైనా ఇస్తారేమో అనుకుంటున్న తరుణంగా మంత్రి తుమ్మల రైతుల ఆశలను ఆడియాశలు చేస్తూ బాంబు పేల్చారు. గత యాసంగి డబ్బులు మేము ఇచ్చాం కాబట్టి వానకాలం(ఖరీఫ్) డబ్బులు ఇవ్వలేమని తేల్చేశారు. యాసంగిలో ఇచ్చామంటే అవి ఏలాగూ ఇవ్వాల్సిందే అన్నది అందరికి తెలిసిందే. ఇక ఎన్నికల హామీ మేరకు రూ.7,500 ఇవ్వాల్సింది పోయి... కేసీఆర్ హయాంలోని రూ.5వేలతోనే సరిపెట్టారు. ఇప్పుడైనా 7,500 రూపాయల చొప్పున ఇస్తారనుకుంటే అసలుకే ఎసరు పెట్టేందుకు సిద్ధమయ్యారు. వానకాలం ఏమో గానీ అసలు ఈ పథకాన్ని అమలు చేస్తారా, లేదా అన్న సందేహాలు మొదలయ్యాయి. ఉమ్మడి జిల్లాలో వానకాలంలో సుమారు 22లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతుంటాయి. రైతులకు ఇదే కీలకమైన సీజన్. యాసంగిలో ఇంతస్థాయిలో పంటలు సాగు కావు. అందుకే వానకాలం ఎగ్గొట్టి యాసంగిలో అయితే తక్కువ విస్తీర్ణంలో పంటలు సాగవుతాయి గనుక.. సాగు చేసిన పంటలకే రైతుభరోసా ఇస్తే ప్రభుత్వంపై భారం సగానికి సగం తగ్గుతుందన్న ఆలోచనతో ప్రభుత్వం ఉన్నట్లుగా తెలుస్తున్నది.

గొప్ప ఆలోచనతో శ్రీకారం చుట్టిన కేసీఆర్

వ్యవసాయంలో కీలకమైన సాగునీరు, నిరంతర ఉచిత విద్యుత్కు పెద్దపీట వేసిన కేసీఆర్ రైతులకు పెట్టుబడి సాయం ఇస్తే ప్రతి ఎకరా సాగు చేస్తారనే గొప్ప ఆలోచనతో రైతుబంధుకు శ్రీకారం చుట్టారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 2014కు పూర్వం 13 లక్షల ఎకరాలే సాగులో ఉండగా, ఆయన ఆలోచనను అక్షరాల నిజం చేస్తూ 2023 నాటికి 22 లక్షల ఎకరాలకు సాగు విస్తీర్ణం పెరిగింది. సీజన్ ఆరంభంలో రైతులకు కీలకమైన పెట్టుబడిని కేసీఆర్ సర్కారునే సమకూర్చడంతో ప్రతి ఎకరాను సాగులోకి తెచ్చి ఉమ్మడి జిల్లాలో అద్భుతమైన పంటలు పండిస్తున్నారు. ధాన్యం దిగుబడిలో దేశంలోనే అగ్రగామి జిల్లాల సరసన నల్లగొండ నిలవడం విశేషం. 2018 వానకాలం సీజన్ నుంచి మొదలుపెట్టి ఎకరానికి ఐదు వేల చొప్పున ఏడాదిలో రెండు సీజన్లకు కలిపి 10వేల రూపాయల సాయాన్ని అందిస్తూ వచ్చారు. అప్పటి నుంచి 2023 వానకాలం సీజన్ వరకు ఎన్నడూ రైతుబంధు ఆగలేదు. మొత్తం వరసగా 11 సార్లు రైతుబంధు ద్వారా ఉమ్మడి జిల్లా రైతులకు రూ.11,700 కోట్ల రూపాయల నగదును నేరుగా అందింది. ఇన్ని కోట్ల రూపాయల్లో ఒక్క రూపాయి పక్కదారి పట్టకుండా ప్రతి పైసా నేరుగా రైతులకే చెందడం విశేషం. ఇంతటి కీలకమైన పథకం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నీలినీడలు కమ్ముకుంటుండడం ఆందోళన కలిగిస్తున్నది.

కాలయాపన చేస్తూ అసలుకే ఎసరు..

ఈ ఏడాది ఆరంభంలో కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పినట్లు ఎకరాకు రూ.7,500 ఇవ్వాల్సిందిపోయి... గతంలో ఇచ్చినట్లుగానే రూ.5వేలు అష్టకష్టాల మీద ఇచ్చి చేతులు దులుపుకొంది. దాంతో రైతులు వానకాలంలో ఎకరాకు రూ.7,500 రైతుభరోసా వస్తుందని గంపెడాశలు పెట్టుకున్నారు. కానీ రైతులకు కాంగ్రెస్ సర్కార్ మొండిచేయి చూపినట్లే. రైతుబంధులో అనర్హులకు పెట్టుబడి సాయం అందుతున్న పేరుతో సబ్ కమిటీ వేశారు. ఈ కమిటీ సభ్యులు హెలికాప్టర్ వేసుకుని ఉమ్మడి జిల్లాల వారీగా సమావేశాలు ఏర్పాటు చేసి అభిప్రాయాలు సేకరించారు. 15 రోజుల్లో నివేదిక ఇవ్వగానే గత అసెంబ్లీ సమావేశాల్లోనే చర్చించి రైతుభరోసాపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దల హడావుడి చూసి రైతులు నిజమే అనుకున్నారు. కానీ అభిప్రాయాల సేకరణ ఎటు పోయిందో, సబ్ కమిటీ నివేదిక ఏమైందో ఎవరికీ తెలియదు. ఇవన్నీ ఇలా ఉండగా ఏకంగా వానకాలం రైతుభరోసా ఇవ్వలేమని మంత్రి తుమ్మల ప్రకటించడంతో ఒక్కసారిగా రైతుల్లో కలవరం మొదలైంది. రుణమాఫీ పేరుతో మోసం చేసి, ఇపుడు రైతుభరోసాకు ఎగనామం పెట్టడాన్ని జీర్ణించుకోలేక పోతున్నారు.

నేడు బీఆర్ఎస్ ఆందోళనలు

వానకాలం సీజన్ రైతుభరోసా ఇవ్వాల్సిందేనని బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేస్తున్నది. రైతు భరోసా ఎగ్గొటేందుకు కుట్రలు చేస్తున్న ప్రభుత్వంపై రైతుల పక్షాన పోరాటానికి సిద్ధమని పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ ప్రకటించారు. ఆదివారం రైతులతో కలిసి అన్ని మండల కేంద్రాల్లో ధర్నాలు, నిరసనలు చేపట్టాలని పార్టీ నేతలు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. దాంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ నేతలు, శ్రేణులు సమాయత్తం అవుతున్నారు. ప్రభుత్వం దిగి వచ్చి వానకాలం రైతుభరోసా చెల్లించే వరకు పోరాటం ఆగదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి హెచ్చరించారు.

రైతు వ్యతిరేక కాంగ్రెస్ సర్కార్

- జనగాం క్రాస్ రోడ్డులో సీఎం రేవంత్రెడ్డి దిష్టిబొమ్మ దహనం
- రైతు భరోసాపై మోసాన్ని ఖండిస్తూ ఆందోళన

సూర్యాపేట రూరల్, అక్టోబర్ 19 : వానకాలం పంటకు రైతు భరోసా ఇచ్చేది లేదని తేల్చిచెప్పిన కాంగ్రెస్ది రైతు వ్యతిరేక ప్రభుత్వమని సీఎం రేవంత్రెడ్డి మరోసారి నిరూపించారని బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. వానకాలం సీజన్కు రైతులకు ఇవ్వాల్సిన రైతు భరోసాను ఇవ్వకపోవడానికి నిరసిస్తూ శనివారం స్థానిక జనగాం క్రాస్ రోడ్డులో జాతీయ రహదారిపై మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్రెడ్డి పిలుపు మేరకు నిరసన తెలిపారు. ఆ పార్టీ నేతలు నిమ్మల శ్రీనివాస్గౌడ్, జీడి భిక్షం, నెమ్మాది భిక్షం ఆధ్వర్యంలో సీఎం రేవంత్రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వరాష్ట్రంలో రైతులను మాజీ సీఎం కేసీఆర్ కంటికి రెప్పలా కాపాడుకుంటూ వస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం గోస తీయిస్తున్నదని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చే రైతుబంధు కంటే ఎక్కువ సాయం ఇస్తామని చెప్పి ఇప్పుడు నిలువునా మోసం చేసిందన్నారు. ఆందోళనలో బిఆర్ఎస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఆలేరులో మీడియాతో మాట్లాడుతున్న మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్రెడ్డి

ఆలేరులో ఆగిన అభివృద్ధి

నిధులున్నా పనులు ఎందుకు చెయ్యరు?

- మున్సిపల్ భవనం, సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు పూర్తి చేయాలి
- మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతాహేందర్రెడ్డి

ఆలేరు టౌన్, అక్టోబర్ : నిధులు ఉన్నా ఆలేరు నియోజకవర్గం అభివృద్ధికి నోచడం లేదని మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్రెడ్డి అన్నారు. శనివారం స్థానిక రహదారి బంగ్లాలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో మాజీ మంత్రి కేటీఆర్ ద్వారా ఆలేరు మున్సిపాలిటీ అభివృద్ధి కోసం స్పెషల్ ఫండ్స్ కింది టీయూఎఫ్ఐడీ నిధులు 15 కోట్లు తీసుకువచ్చినట్లు తెలిపారు. అందులో 3 కోట్లు మున్సిపల్ భవన నిర్మాణానికి, 3 కోట్లు పోలీస్ స్టేషన్ నుంచి దుర్గమ్మ గుడి వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి, మిగతా 9 కోట్లు పట్టణంలో డ్రైనేజీ నిర్మాణ పనుల కోసం గతంలోనే విడుదల చేసినట్లు చెప్పారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ గతంలో శంకుస్థాపన చేసిన మున్సిపల్ భవనాన్ని నిర్మించలేక ఆపివేయడం విడ్డూరంగా ఉందన్నారు. నిర్మాణ అవసరాల కోసం అప్పట్లోనే ఇసుకున కూడా డంప్ చేసి పెట్టినట్లు తెలిపారు. ఆలేరు పరిస్థితి అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లు తయారైందన్నారు. నిధులు తీసుకొచ్చినా నిర్మాణాన్ని ఎందుకు ఆపారో చెప్పాలని ప్రశ్నించారు. ఆలేరులో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారినా 9 కోట్లతో పనులు చేపట్టకపోవడం శోచనీయమన్నారు. మున్సిపల్ భవన నిర్మాణాన్ని ప్రభుత్వం వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆయా పనులను కాంట్రాక్టర్కు వెంటనే అప్పగించి త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. రైతులు ధాన్యం పండించి 20 నుంచి 25 రోజులు గడుస్తున్నా ప్రభుత్వం కోనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో రైతులు దళారులకు అమ్మి మోసపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ సీఎం కేసీఆర్ హయాంలో రైతులకు మద్దతు ధర కల్పించి, కల్లాల వద్దే ధాన్యం కొనుగోలు చేయడాన్ని గుర్తుచేశారు. రైతుల పట్ల నిర్లక్ష్యం ప్రదరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం రానున్న రోజుల్లో అన్నదాతల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య, మాజీ వైస్ ఎంపీపీ కోరకప్పుల కిష్టయ్య, బీఆర్ఎస్ మాజీ పట్టణాధ్యక్షుడు మొరిగాడి వెంకటేశ్గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్లు కుండే సంపత్, పత్తి వెంకటేశ్, ఎండీ ఫయాజ్, యువజన విభాగం పట్టణాధ్యక్షుడు పూల శ్రవణ్ పాల్గొన్నారు.

కట్టంగూరులో రైతుధర్నాలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

భేషరతుగా రుణమాఫీ చేయాలి

- హామీలను అమలు చేసే వరకు ఉద్యమిస్తాం
- కట్టంగూర్ రైతుధర్నాలో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి

కట్టంగూర్, అక్టోబర్ 19 : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రైతులందరికీ భేషరతుగా రుణమాఫీ చేయాలని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య డిమాండ్ చేశారు. షరుతుల్లేని రుణమాఫీ కోసం శనివారం కట్టంగూర్లో నిర్వహించిన రైతు ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీఎం రేవంత్రెడ్డికి సిగ్గూశరం ఉంటే ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండి ఆరు గ్యారెంటీలను అమలు చేయాలన్నారు. రుణమాఫీపై ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రితోపాటు మంత్రులు పొంతన లేని ప్రకటనలు చేస్తూ రైతులను గందరగోళానికి గురి చేస్తున్నారన్నారు. అడ్డగోలు షరతుల కారణంగా వేలాది మంది రైతులకు రుణమాఫీ కాలేదన్నారు. సాగు నీటి విడుదల, రూ.500 బోనస్, రైతు భరోసా, రుణమాఫీ, కొత్త రుణాలు ఇవ్వడంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు మొండి చెయ్యి చూపిందని మండిపడ్డారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు రైతుల అవసరాలు తెలుసుకుని వారు అడగకుండానే రుణమాఫీ, రైతుబంధు, రైతుబీమా ఇచ్చి దేశానికే అన్నపెట్టే అన్న పూర్ణ తెలంగాణగా తీర్చిదిద్దారన్నారు. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి లక్షల ఎకరాలకు సాగు నీరందించారని తెలిపారు. హైడ్రా పేరుతో హైదరాబాద్లో పేదోళ్ల ఇండ్లను కూడగొట్టిన రేవంత్రెడ్డికి వారి ఉసురు తాకుతుందన్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నారని, అయినా భయపడే ప్రసక్తే లేదని, బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. రైతులకు రుణమాఫీ, రైతు భరోసా, రైతు బీమా, రూ.500 బోనస్ ఇచ్చేంత వరకు బీఆర్ఎస్ పార్టీ రైతుల పక్షాన పోరాడుతుందని హెచ్చరించారు. అనంతరం తాసీల్దార్ గుగులోతు ప్రసాద్కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ తరాల బలరాములు, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ పోగుల నర్సింహ, మాజీ సర్పంచ్లు, మాజీ ఎంపీటీసీలు వడ్డె సైదిరెడ్డి, గుర్రం సైదులు, పనస సైదులు, దాసరి సంజయ్కుమార్, పిన్నపురెడ్డి సైదిరెడ్డి, బెల్లి సుధాకర్, జానీపాషా, నాయకులు పెద్ది బాలనర్సయ్య, అంతటి శ్రీను, గాజుల బుచ్చమ్మ, పాదూరి శిశుపాల్రెడ్డి, చౌగోని జనార్దన్, చీర రవి, రెడ్డిపల్లి మనోహర్, నకిరేకంటి నర్సింహ, ఎర్రమాద నర్సిరెడ్డి, చెరుకు నర్సింహ, వడ్డె సైదిరెడ్డి, మంగదుడ్ల వెంకన్న, శ్రీపాద రామకృష్ణ, మేకల రమేశ్, పోతరాజు నగేశ్, మల్లేశ్, శ్రీను పాల్గొన్నారు.

ఎంజీయూ అభివృద్ధికి కృషి

- నూతన కోర్సులను అందుబాటులోకి తెస్తాం
- ఎంజీయూ వీసీగా బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్

ఎంజీయూ వీసీగా భాధ్యతలు స్వీకరిస్తున్న ప్రొఫెసర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్

రామగిరి, అక్టోబర్ 19 : మహాత్మా గాంధీ యూనివర్సిటీ నూతన వీసీగా ప్రొఫెసర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఉదయం హైదరాబాద్లో ఇన్చార్జి వీసీ, ఐఏఎస్ అధికారి నవీన్ మిట్టల్ను మర్యాదపూర్వకంగా కలిసి ఆయన నుంచి బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా పుష్పాగుచ్ఛం అందించి నవీన్మిట్టల్ అభినందనలు తెలిపారు. అనంతరం అక్కడి నుంచి ఎంజీయూకు చేరుకోగా, ఇన్చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అల్వాల రవి, సీఈవో డాక్టర్ ఉపేందర్ రెడ్డి, ఓఎస్డీ ప్రొఫెసర్ కొప్పుల అంజిరెడ్డి పుష్పాగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నమస్తే తెలంగాణ పలుకరించగా.. నూతన వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ పలు విషయాలు పంచుకున్నారు. గతంలో ఇక్కడ పని చేసిన అనుభవంతో వర్సిటీ అభివృద్ధికి అవసరమైన అంశాలపై స్పష్టమైన అవగాహన ఉందన్నారు. నూతన కోర్సులను అందుబాటులోకి తెచ్చి విద్యాభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటానని తెలిపారు. అందరి సహకారంతో ఎంజీయూను ఇతర యూనివర్సిటీలకు రోల్డ్మోడల్గా ఉంచుతామన్నారు. ఎంజీయూలో అత్యాధునిక క్రీడామైదానాలు అందుబాటులో ఉన్నందున స్పోర్ట్స్ అథారిటీని సంప్రదించి, అవసరమైతే ఎంఓయూ చేసుకుని ఇండోర్ స్టేడియాన్ని వినియోగంలోకి తెస్తానన్నారు. అంతకుముందు వర్సిటీ హాస్టల్స్ డైరెక్టర్ డాక్టర్ దోమల రమేశ్, ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ మిర్యాల రమేశ్కుమార్, వర్సిటీ కళాశాలల ప్రిన్సిపాళ్లు, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది, ఎంజీయూ పరిధిలోని ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల ఉమ్మడి జిల్లా, రాష్ట్ర నాయకులు సూర్యనారాయణరెడ్డి, గింజల రమణారెడ్డి, మారం నాగేందర్రెడ్డి, గుండెబోయిన లింగయ్యయాదవ్, జానయ్య, రాంమోహన్ తదితరులు వీసీకి స్వాగతం పలికారు.

రామన్నపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

మా భవిష్యత్ను ప్రశ్నార్థకం చేయొద్దు

- సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటును నిరసిస్తూ విద్యార్థుల ర్యాలీ

రామన్నపేట, అక్టోబర్19 : రామన్నపేటలో కాలుష్య కారక సిమెంట్ పరిశ్రమను ఏర్పాటు చేసి తమ భవిష్యత్ను ప్రశ్నార్థకం చేయొద్దని శనివారం విద్యార్థి సంఘాలు, పాఠశాలల యాజమాన్యాలు, పర్యావరణ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో మండల కేంద్రంలో విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. సుభాష్ సెంటర్లో మానవహారం నిర్వహించి అంబుజా సిమెంట్ పరిశ్రమ మా కొద్దు అంటూ నినాదాలు చేశారు. ఈ నెల 23న జరిగే ప్రజాభిప్రాయ సేకరణకు కుటుంబాలుగా తరలి వచ్చి నిరసన వ్యక్తం చేస్తామన్నారు. సిమెంట్ పరిశ్రమకు అనుమతులు ఇవ్వవద్దని గౌడ కుల సంఘం, మత్స్య పారిశ్రామిక సంఘం ఆధ్వర్యంలో డిప్యూటీ తాసీల్దార్కు వేరువేరుగా వినతి పత్రాలు అందించారు. కార్యక్రమాల్లో పర్యావరణ పరిరక్షణ వేదిక కన్వీనర్ జెల్లెల పెంటయ్య, కో కన్వీనర్ ఎండీ రేహాన్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పోశబోయిన మల్లేశం, సీపీఐ మండల కార్యదర్శి ఊట్కూరి నర్సింహ, సీపీఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, అఖిలపక్ష నాయకులు కన్నెబోయిన బలరాం, ఫజల్బేగ్, కందుల హన్మంతు, రాజు, గణేశ్, బాలరాజు, వెంకటయ్య, పాఠశాలల కరస్పాండెంట్లు గంగుల నరేందర్రెడ్డి, జేఎస్ మార్టిన్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

పిడుగుపాటుతో మహిళా కూలీ మృతి

నాగమణి (ఫైల్)

అడవిదేవులపల్లి, అక్టోబర్ 19 : మండల పరిధిలోని మొల్కచర్ల గ్రామ పరిధిలోని బాలాజీతండాకు చెందిన మహిళ పిడుగుపాటుకు ప్రాణాలు వదిలింది. ఎస్ఐ శేఖర్ వివరాల ప్రకారం.. బాలాజీతండాకు చెందిన నాగమణి(30) మరో ముగ్గురితో కలిసి అదే గ్రామానికి చెందిన హరి మిరపతోటలో కలుపు తీసేందుకు కూలికి వెళ్లింది. మధ్యాహ్నం వర్షం పడడంతో ఇంటికి తిరిగి వస్తుండగా, బాల్నెంపల్లి గ్రామ